# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 18-10-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటన విజయవంతం కావడంపై మంత్రులు, వివిధ శాఖల అధికారులను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు.**

2. **ప్రతీ ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ తరహాలో తీర్చిదిద్దాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.**

3. **ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 51 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.**

4. **ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు.**

==========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటన విజయవంతం కావడంపై మంత్రులు, వివిధ శాఖల అధికారులను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో అభినందించారు. అమరావతిలోని సచివాలయం నుంచి సంబంధిత అధికారులతో దృశ్య శ్రవణ మాధ్యమ సమావేశం నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రధానమంత్రి రాష్ట్రంలో 4వసారి జరిపిన పర్యటనలో కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారని... వీటిల్లో కర్నూలులో నిర్వహించిన సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ బహిరంగ సభ గ్రాండ్ సక్సెస్ అయ్యిందని చంద్రబాబు పేర్కొన్నారు.

--------------------------

ప్రతీ ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ తరహాలో తీర్చిదిద్దాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాదులోని సచివాలయంలో విద్యాశాఖ అధికారులతో ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతుల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. తొలి దశలో ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్‌పై దృష్టి సారించాలని చెప్పారు. ఆట స్థలాలు, అవసరమైన తరగతి గదులతోపాటు మంచి వాతావరణం ఉండేలా చూడాలని ముఖ్యమంత్రి సూచించారు.

--------------------------

వస్తు సేవల పన్ను - జిఎస్టీ విషయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలపై వివిధ వర్గాల

ప్రజలు హర్షం వక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో పేద, మధ్యతరగతి ప్రజలతోపాటు, చిన్న, మధ్య తరగతి వ్యాపారులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన ఎరువుల దుకాణం యజమాని సైదారావు ఆకాశవాణితో మాట్లాడుతూ..

వాయిస్... 26 సెకన్లు

---------------------------

కూటమి ప్రభుత్వం రైతు అనుకూల ప్రభుత్వమని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఈ ఏడాది నుంచి కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా డి.ముప్పవరం గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..

..వాయిస్..30 సెకన్లు

---------------------------

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 51 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. విజయవాడలో ధాన్యం మిల్లర్లతో సమావేశాన్ని ఆయన నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ నెల 27వ తేదీ నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించనున్నట్లు చెప్పారు. రైతులు కోరిన 24 గంటల్లో ధాన్యం కొనుగోలు చేయడంతోపాటు, 48 గంటల్లో నగదు రైతు ఖాతాలో నగదు జమ చేయడం జరుగుతుందన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల్లో ఈరోజు స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమం పెద్దఎత్తున నిర్వహించాలని మున్సిపల్ అధికారులను మంత్రి నారాయణ ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్లతో శ్రవణమాధ్యమ సమావేశాన్ని ఆయన నిన్న నిర్వహించారు. 'క్లీన్ ఎయిర్ థీమ్' తో కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ప్రజాప్రతినిధులను, ప్రజలను భాగస్వామ్యం చేసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గాలి కాలుష్యం తగ్గించేందుకు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించాలని సూచించారు.

---------------------------

రైతాంగానికి మెరుగైన సేవలను అందించడానికి, భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో రెవెన్యూ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టామని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. హైదరాబాదులోని రాష్ట్ర సచివాలయంలో రెవెన్యూ శాఖపై నిన్న సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి మండలానికి కనీసం 4 నుంచి 6 గురు లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నామన్నారు. శిల్ప కళావేదికలో శిక్షణ పొందిన లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి రేపు లైసెన్స్‌లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 127వ సంచిక ఈనెల 26వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్

కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 24వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

'అమృత్ సంవాద్' రైల్వేను ప్రయాణీకులతో అనుసంధానించే వేదిక అని విజయవాడ అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ కొండా శ్రీనివాస్ రావు తెలిపారు. విజయవాడ రైల్వే స్టేషన్ లో 'అమృత్ సంవాద్' కార్యక్రమాన్ని నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రయాణీకులు అందించిన సూచనలు, సలహాలను పరిశీలించి, వాటిని అమలు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

---------------------------

ప్రజలు ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం, తూర్పునాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో 45 మంది లబ్ధిదారులకు 30 లక్షల రూపాయల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆయన నిన్న పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...

వాయిస్... 28 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాం దిగువ ట్రోపో ఆవరణంలో తూర్పు, ఈశాన్య గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో... ఆంధ్రప్రదేశ్‌లో ఈరోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ పేర్కొంటూ..

..వాయిస్..34 సెకన్లు

తెలంగాణలో ఈరోజు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

---------------------------

'సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్' లో భాగంగా విశాఖ నగరం పాండురంగాపురంలోని జిమ్నాస్టిక్స్ ఇండోర్ స్టేడియంలో హస్తకళలు, క్రీడా పరికరాల ప్రదర్శన, అమ్మకాలను నిన్న ప్రారంభించారు. క్రీడాకారులు, సాధారణ పౌరులు వాటిని కొనేందుకు, వీక్షించేందుకు ఆసక్తి కనబరిచారు. విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సంబంధిత ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. అక్కడ అందుబాటులో ఉంచిన క్రీడా పరికరాలను, హస్త కళలకు సంబంధించిన వస్తువులను పరిశీలించారు.

=====================